క్లుప్తంగా

భూసార పరీక్షల ఫలితాలపై అవగాహన కల్పించండి

కణేకల్లు: భూసార ఫలితాలతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఎంపీఈఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఆత్మ పీడీ మద్దిలేటి సూచించారు. కణేకల్లులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం భూసార ఫలితాలు–పంటల సాగుపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రైతుల పొలాల్లో సేకరించిన 483 భూసార మట్టి నమూనాల ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఫలితాల ఆధారంగా మూడేళ్ల వరకూ పొలాల్లో అనుకూలమైన పంటలు సాగు చేస్తూ ఎరువులు, జిప్సం, భాస్వరం, నత్రజని, పొటాషియం తగిన మోతాదులో వాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఫారం ఏడీఏ శంకర్‌నాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

ఉరవకొండ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం రాయంపల్లి అవుట్‌లో సర్వే నంబర్ 603–ఏ, 628–2డీలోని భూముల్లో 300 మంది పేదలకు ఇళ్ల పట్టాలను అందజేస్తామని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

జై కిసాన్ ఫౌండేషన్ సేవలు ఆదర్శం

ఉరవకొండ: పట్టణంలో జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జాతీయ రైతు దినోత్సవం జరగనుంది. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగమల్లి ఓబుళేసుతో కలిసి పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతికి ఆవిర్భవించిన జై కిసాన్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పట్టణంలో రైతులతో కలిసి ర్యాలీ, ఆదర్శ రైతులు వారి కుటుంబాలకు సన్మానం, రైతు కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం కార్యక్రమాలు చేపడుతామని నాగమల్లి ఓబుళేసు తెలిపారు.



రైతు దినోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఆరోగ్యశ్రీతో పేదలకు లబ్ధి

గుమ్మఘట్ట: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో పేదలందరికీ లబ్ధి చేకూరుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొత్త ఫీచర్లతో ముద్రించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నిరుపేదలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకూ పెంచారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, బాలాజీనాయక్, ఎంపీపీ భవాని, ఎంపీటీసీ మారెక్క, గోవింద, మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, ఎస్సీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవింద, మాజీ సర్పంచ్ చిత్రశేకరప్ప, కెఎం రాజు, మల్లికార్జున, రాఘవేంద్రరెడ్డి,ఈఓఆర్డీ సురేశ్‌బాబు, సీహెచ్ఓ మురళీధర్,నారాయణరెడ్డి, పల్లక్కిరెడ్డి పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న కాపు భారతి

విడపనకల్లు: పెద్ద కొట్టాలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వేల్పుమడుగులో ఎంపీపీ కరణం పుష్పావతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌బాబు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ తిరుపాల్ నాయక్, సూపర్‌వైజర్లు పద్మజ కుమారి, శ్రీనివాసులు, శివరామకృష్ణ, అనసూయమ్మ, సుగుణ, రోషిణి, మహాలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

నేడు వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

కంబదూరు/వజ్రకరూరు/రాయదుర్గం/ఉరవకొండ/కూడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకోనున్నారు. ఆయా మండల కేంద్రాల్లో కేక్ కటింగ్, అన్నదానం తదితర సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కాపు, కంబదూరు మండల కన్వీనర్ బాలరాజు యాదవ్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ రామచంద్రా రెడ్డి, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ట్యాబ్‌ల పంపిణీ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మండలానికి మొత్తం 644 ట్యాబ్‌లు వచ్చినట్లు ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప తెలిపారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఖాళీ స్థలాలను 15 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వనున్నారు. బుధవారం పట్టణంలోని వ్యాపారవేత్తలతో డిపో రిజనల్ మేనేజర్, శ్రీసుమంత్, డిపో మేనేజర్ రామచంద్ర సమావేశమయ్యారు. టెండర్ దాఖలు, ప్రభుత్వ విధి విధానాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కూడేరు: మతం కన్నా మానవత్వం ముఖ్యమని బిగ్ బాస్–7 రన్నర్ అమర్‌దీప్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కుష్టు రోగుల కాలనీలో అనంతపురానికి చెందిన సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బిగ్‌బాస్–7 షో రన్నర్ అమర్‌దీప్, తేజశ్విణి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరైన కేక్ కట్ చేశారు. అనంతరం కుష్టు రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏసు జీవితం ఆదర్శమని కొనియాడారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి మాట్లాడుతూ.. మానవత్వంతో ముందుకు సాగుతామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ట్రస్టు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రుక్మిణీ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న బిగ్‌బాస్ షో రన్నర్ అమర్‌దీప్

దేవాంగ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్‌లోని దేవాంగ కళ్యాణ మండపంలో బుధవారం దేవాంగ సంక్షేమ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉరవకొండ ఈఓఆర్‌డీ చంద్రమౌళి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంగల మహేష్ మాట్లాడుతూ.. దేవాంగులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గత కొన్నేళ్లుగా దేవాంగ సంక్షేమ సంఘం తరఫున విద్య, వైద్యం, క్రీడలకు అత్యంత ప్రాధాన్యత సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మిడతల చంద్రమౌళి, ఎంసీ నాగభూషణం , రాము, టౌన్‌బ్యాంకు అధ్యక్షులు సాధు కుళ్లాయిస్వామి, చంగల భోజరాజు, ప్రభాకర్, బాలచంద్ర, చంగల అమరేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కలిగొలిమి పరిసరాల్లో చిరుతల సంచారం

కుందుర్పి: మండలంలోని కలిగొలిమి, కొత్తపల్లి పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా రెండు చిరుతలు సంచరిస్తూ మూగజీవాలపై దాడులు చేస్తున్నట్లు పరిసర గ్రామాల రైతులు గోవిందప్ప, మారెన్న, రామలింగప్ప,రామాంజినేయులు తదితరులు తెలిపారు. ఇటీవల రెండు మేకలు, ఒక బర్రెను చిరుతలు చంపినట్లు పేర్కొన్నారు. కుందుర్పి పరిసర ప్రాంతాల్లోనే చిరుత సంచరిస్తున్నట్లు పరిసర ప్రాంతాల ప్రజలు తెలిపారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



రవి మృతదేహం

శెట్టూరు: మండల పరిధిలోని బుడ్డయ్యదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల రవి (33) పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వివరాలు.. వీరనాగప్ప కుమారుడు గొల్ల రవి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో బోర్లు వేయడానికి, పండల సాగుకు సుమారు రూ.4.50 లక్షల వరకూ అప్పు చేశాడు. అప్పు తీర్చలేక మనోవేదనతో బాధపడేవాడు. గత ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగు మందు సేవించాడు. ఇంటికి వచ్చిన భ్యార లక్ష్మీదేవి ఎందుకు అలా ఉన్నావు అని ఆరా తీసింది. పురుగు మందు తాగినట్లు రవి తెలిపాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా.. బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

తక్షణసాయం అందజేత

శెట్టూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన వడ్డే వెంకటేశులు కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద బుధవారం రూ.10 వేల తక్షణసాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు పోస్ట్ రామకృష్ణ, హరినాథ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా సహాయ కార్యదర్శి లింగమయ్య తదతరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

బెళుగుప్ప: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈశ్వరి, మధుశ్రీ వ్యాసరచన పోటీల్లో, క్విజ్‌లో రంజిత్, కే.తేజ, వక్తృత్వ పోటీల్లో వరుణ్‌కుమార్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ తెలిపారు. గురువారం జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రఫీ, ఉపాధ్యాయులు ఇమాంసాబ్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు

కూడేరు: మండల పరిధిలోని చోళసముద్రం అంబేడ్కర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ నారాయణ రెడ్డి ప్రారంభించారు. రూ.5 లక్షల ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డు పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వినర్ రామచంద్రారెడ్డి, సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణ, వాటర్ షెడ్ చైర్మన్ పెన్నోబులేసు, పార్టీ మండల నేతలు గంగాధర్, దేవేంద్ర, లోకనాథ్ స్వామి, సిద్ధారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎర్రనాగప్ప, రామాంజనేయులు, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

గుమ్మఘట్ట: వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం వేలం వేశారు. వేలం ద్వారా వచ్చిన రూ.1,89,980లను ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నట్లు ఎస్ఐ సునీత తెలిపారు.

దుర్గంలో పర్యటించిన డీఎస్పీ

రాయదుర్గం: రోడ్లపై అడ్డంగా నిలిపి రవాణా కార్యకలాపాలు సాగించే బస్సులపై కేసులు నమోదు చేయాలని డీఎస్పీ బీ శ్రీనివాసులు ఆదేశించారు. సాక్షి పత్రికలో ప్రచురితమైన దుర్గంలో ట్రాఫిక్ పద్మవ్యూహం అనే కథనానికి పోలీసులు స్పందించారు. గురువారం పట్టణంలోని వినాయకసర్కిల్, బళ్లారి రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో సీఐ లక్ష్మన్న, ఎస్ఐ ప్రసాద్ పర్యటించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనల ప్రకారం వ్యవహరించని వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

హాకీ క్రీడాకారులకు అభినందన

విడపనకల్లు: ఈనెల 16, 17 తేదీల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో అండర్–14 విభాగం జిల్లా స్థాయి హాకీ క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాల బాలికలు మంచి ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గురువారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సర్వమంగళం, పీడీ శ్రీనివాసులు అభినందించారు.

కౌశల్ క్విజ్‌లో విద్యార్థిని ప్రతిభ

బొమ్మనహాళ్: కౌశల్ క్విజ్–2023 పోటీల్లో బొమ్మనహాళ్ విద్యార్థిని అనూష జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించినట్లు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ తెలిపారు. అనంతపురంలో జరిగిన సభలో డీఈఓ నాగరాజు రూ.2 వేల రివార్డు ఇచ్చారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అనూష రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయురాలు తబ్సుమ్ పేర్కొన్నారు.

సూక్ష్మ సేద్యపు పరికరాల ధ్వంసం

బెళుగుప్ప: తన పొలంలో సూక్ష్మ సేద్యపు పరికరాలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు తిప్పేస్వామి తెలిపాడు. ఫిల్టర్, గేట్ వాల్వులను ధ్వంసం చేసి బోరుబావి నీటిని వృథాగా వదిలివెళ్లారని ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ముగిసిన యల్లమ్మ జాతర

కుందుర్పి: నాగేపల్లిలో యల్లమ్మ ఉత్సవాలు, మహంతపురం పాతప్పస్వామి జాతర బుధవారం ముగిశాయి. నాగేపల్లిలో యల్లమ్మను ఉదయం వెండి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పానకం బండ్లను ఆలయం చుట్టూ ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. మహంతపురంలో పాతప్ప స్వామికి పూజలు చేశారు. గ్రామశాంతి, గావుతీయు కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.